ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 22 ఏప్రిల్ 2024

ఎర్రని పూలు.. కనులకు విందు..



యాచారం మండలంలోని చౌదర్‌పల్లి-ధర్మన్న గూడ, యాచారం-చౌదర్‌పల్లి గ్రామాల మధ్య, యాచారం-మాల్, గున్‌గల్ గేటు నుంచి ఆగా పల్లి గ్రామాల మధ్య, సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డుకిరువైపులా నాటిని చెట్లకు ఎర్రని పూలు పూసి చూపరులను ఎంతో ఆకట్టు కుంటున్నాయి. అదేవిధంగా యాచారం నుంచి మాల్ ప్రాంతాల మధ్య రహదారికిరువైపులా పూసిన పూలు వాహనదారులు, బాటసారులకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉన్నాయి. అటుగా వెళ్లేవారు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు.

- యాచారం, ఏప్రిల్ 21

నేడు అంతాయపల్లిలో సీఎం బహిరంగ సభ



సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు



మేడ్చల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు మేడ్చల్ జిల్లా అంతాయపల్లిలో సీఎం బహిరంగ సభను నిర్వహించనున్నారు. సోమవారం నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి రెండోసారి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పర్యటించనున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం సాయంత్రం అంతాయపల్లి బహిరంగ సభలో పాల్గొంటారని పార్టీ శ్రేణులు తెలిపాయి. అధికారులు అంతాయపల్లిలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థి నామినేషన్ అనంతరం సీఎం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభాస్థలాన్ని కాంగ్రెస్ శ్రేణులు, పోలీసు అధికారులు పరిశీలించారు.

స్ట్రాంగ్‌రూంకు చేరిన ఈవీఎంలు



చేవెళ్ల : ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంకు తీసుకెళ్తున్న సిబ్బంది

షాద్‌నగర్/చేవెళ్ల, ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు షాద్‌నగర్‌కు చేరుకున్నాయి. ఆదివారం ఉదయం పోలీసు బందోబస్తు మధ్య యంత్రాలను పట్టణంలోని మినీస్టేడియంలో భద్రపర్చారు. ఈసందర్భంగా ఆర్డీవో వెంకటమాధవరావు స్ట్రాంగ్‌రూంలో పరిశీలించిన ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 252 పోలింగ్ కేంద్రాలకు గాను, ఎన్నికల కమిషన్ అధికారులు 328 బ్యాలెట్ ఈవీఎంలు, దీనికి అనుబంధమైన 328 వీవీ ప్యాట్లు, 328 కంట్రోల్ యూనిట్స్‌ను సరఫరా చేయగా కేంద్ర బలగాలతో రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఈవీఎంలను భద్రపరిచిన గదులను ఆర్డీవో సీజ్ చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి, చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్, సీఐ ప్రతాప్‌లింగం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చేవెళ్ల మండల పరిధిలోని గొల్లపల్లి సమీపంలో గల బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు, వీవీ ప్యాట్ మిషన్లను తరలించారు. ఎన్నికల అధికారులు, పోలీస్ బందోస్తు మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచ్చారు. వచ్చేనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎన్నికల నిర్వహణాధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
- సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. చట్టాలు సమగ్రంగా అమలు కావాలని, ఈ విషయంలో మేధావులు, విద్యావంతులు ఆలోచన చేయాల్సిన అవసరముందన్నారు. ఇబ్రహీంపట్నంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం సమాచార హక్కు చట్టం-2005పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ జీవోను అందరికీ ఆన్‌లైన్ ద్వారా ఆర్టీఐ దరఖాస్తులను స్వీకరించడమనేది పారదర్శక పాలనకు నిదర్శనమని వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్ జాతీయ స్థాయిలో తీసుకువచ్చిన ఐదు గ్యారంటీ పథకాలు పేద మహిళలు, రైతులు, యువకులు, శ్రామికులు, విభిన్న వర్గాలకు న్యాయం చేకూరేవిగా ఉన్నాయని, రేవంత్‌రెడ్డి పాలనా నిర్ణయాలు చరిత్రాత్మకమని, భువనగిరి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యాద కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ మాజీ చీఫ్ ఇంజనీర్ ఎంఏ కరీం, సమితి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఖుర్షీద్ పాషా, ఫెడరేషన్ హెచ్‌ఆర్సీ అధ్యక్షుడు సురేష్, శంకర్ రాథోడ్, గంట విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిల్వలతోనే ధరలు పైపైకి..

- సామాన్యులకు అందుబాటులో లేని సన్నబియ్యం
- ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం
- బియ్యం ధరలు పెరిగినా.. మారని రైతుల బతుకులు
- జోరుగా రేషన్ బియ్యం రీసైక్లింగ్!

బియ్యం.. మరింత పిరం!



యాచారంలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ ఉన్న బియ్యం

రోజురోజుకూ పెరుగుతున్న బియ్యం ధరలు సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. గత వానాకాలంలో జిల్లాలో వరి పంట బాగానే పండి ఉత్పత్తి పెరిగినా, దిగుబడి ఆశించిన మేర వచ్చి మార్కెట్లకు ధాన్యం పెద్దయెత్తున వచ్చినా పాత బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నబియ్యం కిలో రూ.50 నుంచి 75కు పెరిగింది. కొద్ది రోజుల్లో యాసంగి పంట చేతికొచ్చి కొత్త బియ్యం రానున్నా.. పాత బియ్యం ధరలు మాత్రం తగ్గడం లేదు. సన్నరకాల ధరలు పెరుగుతూ సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే, బియ్యాన్ని కొందరు బ్లాక్ చేయడం వల్లే మార్కెట్లో కొరత ఏర్పడి రేటు పెరుగుతోందనే ఆరోపణలున్నాయి. పెరిగిన ధరలతో వ్యాపారులు, దళారులే లాభపడుతున్నారు. రైతులకు ఏమాత్రం మేలు చేకూరడం లేదు. పెరుగుతున్న బియ్యం రేట్లతో వినియోగదారులు గోస తీస్తున్నారు.

యాచారం, ఏప్రిల్ 21 : మొన్నటి వరకు కూరగాయల ధరలతో అల్లాడిన జనం నేడు బియ్యం ధరలు పెరగడంతో అల్లాడుతున్నారు. గత వానకాలంలో విస్తారంగా వరి పంట పండినా.. బియ్యం ధరలు మాత్రం సామాన్యులకు అందుబాటులో లేవు. పెరిగిన ధరలతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. మరో ఇరవై రోజుల్లో మార్కెట్లోకి కొత్త బియ్యం వస్తాయి. అయితే, పాత బియ్యం ధరలు మాత్రం మరింత పెరగడం ఖాయమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ధరలు అడ్డగోలుగా పెరుగుతున్నా.. బియ్యం ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు.

భారీగా పెరిగిన రేట్లు

దళారులు బియ్యాన్ని అక్రమంగా నిల్వచేస్తూ బ్లాక్ చేయడం వల్లే మార్కెట్లో కొరత ఏర్పడి రేట్లు పెరుగుతున్నాయి. మునుపెన్నడూ లేనివిధంగా ప్రస్తుతం బియ్యం ధరలు ఉన్నాయని, మరి రేట్లు పెరిగితే రైతులకైనా న్యాయం జరుగుతుందా? అంటే.. అదీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు వ్యాపారులు గోదాంలలో బియ్యం నిల్వచేసి కొరత సృష్టించి.. రేట్లు పెంచి అమ్ముతున్నందునే ఈ పరిస్థితి నెలకొందని జనం చర్చించుకుంటున్నారు. ఏడాది క్రితం సన్న బియ్యం కిలో రూ.50కి విక్రయించగా.. నేడు వివిధ బ్రాండ్లు, రకాన్ని బట్టి కిలో రూ.75 వరకు అమ్ముతున్నారు. అదే క్వింటాళ్లలో కొనుగోలు చేస్తే కిలో రెండు, మూడు రూపాయలు తగ్గిస్తున్నారు. కాగా, బాస్మతి రకం బియ్యం కిలో రూ.150 వరకు విక్రయిస్తున్నారు.

అక్రమ నిల్వలతో కృత్రిమ కొరత

హోల్‌సేల్ వ్యాపారులు బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి డబ్బు సంపాదనకు మార్గంగా ఎంచుకోవడంతో బియ్యం ధరలు పెరగడానికి కారణమనే ఆరోపణలున్నాయి. రేషన్ కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం ఇస్తున్నా.. వారం, పది రోజులకే సరిపోతున్నాయి. దాంతో జనం బియ్యం కొనక తప్పని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న ధరలతో పేదలు బియ్యం కొనలేకపోతున్నారు. ధరలను పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ ఉన్నతాధికారులు 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేయడం లేదు. ఇదిలా ఉంటే, కొందరు వ్యాపారులు రేషన్ బియ్యాన్ని రీసైకిల్ చేసి సన్నబియ్యం అని నమ్మించి అమ్ముతున్నారు. దాంతో సరైన పోషకాలు లేని బియ్యాన్ని సన్నబియ్యం రేటుతో కొని వినియోగదారులు నష్టపోతున్నారు. వ్యాపారులు బియ్యం కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రైస్‌మిల్లులను సందర్శించి బియ్యం బ్లాక్ చేయకుండా చూడడం లేదు. కొందరు మిల్లర్లు బియ్యాన్ని బ్లాక్ చేయడం కూడా ధరల పెరుగుదలకు కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రేషన్ బియ్యం రీసైక్లింగ్

కొందరు బడా వ్యాపారులు మారుమూల గ్రామాలలో జనం నుంచి రేషన్ బియ్యాన్ని తెప్పించుకుంటున్నారు. కిలోరేషన్ బియ్యాన్ని రూ.10 నుంచి రూ.12లకు జనం నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని మళ్లీ రైస్ మిల్లులకు తరలించి రీసైక్లింగ్ చేసి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. జనాలకు రేషన్ బియ్యం అనే అనుమానం రాకుండా మిల్లు బియ్యంలా మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ధరలు పెరిగినా.. రైతన్నకు దక్కని ఫలాలు

ఆరుగాలం కష్టపడి, పెట్టుబడికి అప్పులు చేసి పంటలు పండిస్తున్న అన్నదాతకు మాత్రం అప్పుల కుప్పలే మిగులుతున్నాయి. బియ్యం ధరలు పెరుగుతున్నా.. రైతులకు ఫలాలు దక్కడం లేదు. వారి బతుకులు మాత్రం మారడం లేదు. బియ్యం ధరలతో వ్యాపారులు, దళారీలు మాత్రం చేతినిండా సంపాదిస్తున్నారు. నేడు ఎకరం వరి సాగుకు రూ.25వేల నుంచి 30వేల పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. దిగుబడి మంచిగా ఉంటే ఎకరానికి 40 నుంచి 45 బస్తాల ధాన్యం, వాటిని బియ్యంగా మారిస్తే 25 నుంచి 27క్వింటాళ్లు వస్తాయి. రైతులు మాత్రం అప్పులు తీరడం కోసం ధాన్యాన్ని మాత్రమే విక్రయిస్తున్నారు. కొంతమంది రైతులు బియ్యం విక్రయించినా క్వింటాల్‌కు రూ.5వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు.



దుకాణంలో అమ్మకానికి ఉంచిన బియ్యం

కొత్త బియ్యం వచ్చినా.. రేట్లు యథాతథం



ఇతర రాష్ట్రాలు, దేశాలకు బియ్యం ఎగుమతి చేస్తుండడంతోనే బియ్యం ధరలు పెరుగుతున్నాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాలను కోరుతున్నా. ఎరువులు, విత్తనాల ధరలను ప్రభుత్వం గణనీయంగా తగ్గించాలి. ధాన్యంతో పాటు బియ్యాన్ని గిట్టుబాటు ధర వచ్చేవరకు నిల్వ చేసుకునేలా ప్రతి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం గోదాంలు కట్టించి రైతులను ఆదుకోవాలి.

రామనాథం గుప్తా, వ్యాపారి, యాచారం

గిట్టుబాటు ధర కల్పించాలి



బియ్యం ధరలు అమాంతం పెరిగినా.. మా బతుకులు మారడం లేదు. ఎకరం వరి సాగుకు రూ.30వేల వరకు ఖర్చవుతోంది. పంట సరిగా పండితే ఎకరం 25క్వింటాళ్ల బియ్యం వస్తాయి. రోగం సోకితే 20క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుంది. రైతు ధాన్యం అమ్మే సమయంలో క్వింటాలుకు రూ.3వేల లోపే ఉంటుంది. వ్యాపారులు, మిల్లర్లు మాత్రం రైతుల నుంచి కొన్న రేటుకు రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- బుస్సు కొండల్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి

ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

చిలుకూరుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



మొయినాబాద్ రూరల్ : కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 21: చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర్లస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ, గరుడ వాహనసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీ ఏడాదిలాగే కల్యాణప్రాప్తి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అయితే, గత శుక్రవారం సంతాన భాగ్యం కోసం గరుడప్రసాద పంపిణీకి భక్తులు అనూహ్యంగా తరలిరావడంతో కల్యాణప్రాప్తి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో కేవలం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవోపేతంగా చేపట్టారు. వేదపండితులు తిరుల కిరణాచారి, పురావస్తు రామాచారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణ స్వామి, కన్నయ్య, సురేష్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్ : సూర్యప్రభ సేవలో భక్తులు



షాద్‌నగర్ అర్బన్ : శివపార్వతుల పల్లకీ సేవలో భక్తులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 21: షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేదపండితులు కల్యాణాన్ని జరిపించారు. అంతకుముందు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసి అన్నదానం చేశారు. కాగా, తెల్లవారుజామున అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు లక్ష్మీనారాయణుడి ఆలయం ముస్తాబు

- ఈనెల 26 నుంచి 28 వరకు జాతర
- 27న స్వామివారి కల్యాణ మహోత్సవం

తలకొండపల్లి, ఏప్రిల్ 21 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వెంకటాపూర్ శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. భక్తుల కొంగుబంగారంగా నిలిచిన ఆలయంలో ప్రతీయేటా మూడు రోజులపాటు వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు భక్తులకు విశాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో సత్యనారాయణ స్వామితో పాటు శివలింగం, ఆంజనేయ స్వామి, ఎల్లమ్మ దేవతలు కొలువై ఉన్నారు. ఆలయంలో నిత్యపూజలు కొనసాగుతాయి. దేవాలయానికి సమీపంలో కోనేరుగంగ సమతుల్యతను సంతరించుకుంది. దశాబ్దాల కాలంగా ఆలయ నిర్వాహకులు దాతల సహకారంతో దేవాలయాన్ని అభివృద్ధిపరిచి ఆధునీకరించి భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ చైర్మన్ తిరుమణి శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజన్‌రెడ్డిలు వివరించారు. 26న అఖండ దీపారాధన, గణపతిపూజ, స్వస్తి వాచకం, మండపారాధన, పతాకావిష్కరణ, యజ్ఞ కార్యక్రమాలు, అగ్ని ప్రతిష్ఠ, భజనలు, 27న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం, సాయంత్రం బండ్లు తిరుగుట, పల్లకీసేవ, 28న రథోత్సవం కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.



లక్ష్మీనారాయణస్వామి దేవాలయం





ఆలయ ముఖద్వారం

విద్యతోనే మార్పు సాధ్యమని చెప్పిన
మహనీయుడు అంబేద్కర్



ఘట్‌కేసర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 21: సమాజంలో విద్యతోనే సంపూర్ణ మార్పు సాధ్యమని చాటి చెప్పిన గొప్ప మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. అందరికీ విద్య, ఓటు హక్కు కావాలని, వాటితోనే మార్పు సాధ్యమని చెప్పి దేశ ప్రజలకు ఉచిత నిర్బంధ విద్య, ఓటు హక్కు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఇప్పుడిప్పుడే బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో దేశంలో మంచి నాయకులను ఎన్నుకునేందుకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, ఎం భరత్, దాసు, అశోక్, నర్సింగ్‌రావు, నారాయణ, శ్రీనివాస్, రాజేష్, సత్యం, రాజు, అంజయ్య, పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



ఎండీ.అశ్వాఖ్‌ను సన్మానిస్తున్న దాదాపూర్ గ్రామస్థులు

దోమ, ఏప్రిల్ 21: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఆల్ ఇండియా లెవల్‌లో 770వ ర్యాంకు సాధించిన పెద్దేముల్ మండలానికి చెందిన మొహ్మద్ అశ్వాఖ్‌ను సన్మానించారు. ఆదివారం దోమ మండలంలోని దాదాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ గఫర్, గ్రామస్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అశ్వాఖ్ మాట్లాడుతూ ఉన్నత ఆశయం కలిగి ఉంటూ ఉన్నత విద్య కోసం సహాయ, సహకారాలు అందిస్తానని అశ్వాఖ్ తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ యువత ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు బండ బావిలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

వికారాబాద్, ఏప్రిల్ 21: శ్రీ బండబావి వీరాంజనేయస్వామి జయంతి సందర్భంగా మంగళవారం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బండబావి, భక్త బృందం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ, అభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, స్వామి వారి పల్లకీ సేవ, ఊయల సేవ ఉంటుందన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



పూజలు చేస్తున్న బెల్లయ్య నాయక్

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కడ్తాల్, ఏప్రిల్ 21 : కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందని, ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అన్నారు. మండలంలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జవహర్‌లాల్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హీరాసింగ్, గిరిజన నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సుస్థిర పాలన, సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. కాంగ్రెస్ ప్రజాభిమానం ముందు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు ఫలించవన్నారు. ఈ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదన్నారు. మోదీ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి జరిగిన మేలు ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తులసీరామ్‌నాయక్, ప్రవీణ్, చిన్న, గోపి, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్, బీజేపీలవి కల్లబొల్లి మాటలు

» మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

కేశంపేట, ఏప్రిల్ 21 : కాంగ్రెస్, బీజేపీలవి కల్లబొల్లి మాటలని, ఆ పార్టీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శారద గార్డెన్‌లో ఆదివారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ నేతృత్వంలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో 24గంటల విద్యుత్ సరఫరా చేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో వేసవిలో మత్తడులు దునికేవని.. కాంగ్రెస్ పాలనలో నీరు లేక చెరువులు ఎండిపోయాయని చెప్పారు. 24 గంటల విద్యుత్ సరఫరా ఉండడంలేదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హమీలను మరిచారని, రైతులకు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీపై రోజుకో మాట చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డల పెళ్లిలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఆ పథకాన్ని అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎంపీ బరిలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికులు కాదని, స్థానికుడినైన తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, ఎస్సీఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు రాంబల్‌నాయక్, మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ సజ్జల విశ్వానాథం, యారం శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపులు పట్టించుకునేదెవరు..?

» గ్రామాల్లో తాగునీటి కష్టాలు » పట్టించుకోని అధికారులు

బషీరాబాద్, ఏప్రిల్ 21: గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ నీరు సరిపడా లభించకపోవడంతో ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. పల్లెల్లో ప్రజల నీటి అవసరాలను తీర్చే చేతిపంపులను ఐదారేళ్లుగా పట్టించుకోకపోవడంతో పూర్తిగా మరమ్మత్తుకు గురై చుక్క నీరు రావడంలేదు. ఈ బోర్లను మరమ్మత్తు చేస్తే నీరొచ్చే ఆవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అప్పటి ప్రభుత్వం ప్రతి ఊరికి భగీరథ నీటిని సరఫరా చేయడంతో చేతిపంపుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో వాడుకలో లేక, పట్టిపోయి కొన్ని చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. పలు గ్రామాల్లోని చేతి పంపులను చిన్న చిన్న మరమ్మత్తులు చేస్తే వాడుకలోకి వస్తాయని ప్రజలంటున్నారు. వీటిపై దృష్టి సారిస్తే స్థానిక ప్రజల నీటి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడతాయనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ముందున్న ఎండాకాలం గట్టెక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.



మైల్వార్‌లో పనిచేయని చేతిపంపు

నేడు విద్యుత్ అంతరాయం

దౌల్తాబాద్, ఏప్రిల్ 21: మండలంలోని అల్లాపూర్ ఫీడర్ పరిధిలోని గుమ్మాల, బండివాడ గ్రామాల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని దౌల్తాబాద్ ఏఈ మహిపాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



ప్రతాప్‌సింగారంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కాచవానిసింగారం, ప్రతాప్‌సింగారంకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ఖాళీకావడం ఖాయమని, అందరూ ఆ పార్టీని వీడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఉనికి లేదని, కల్వకుంట్ల కుటుంబం చేసిన తప్పిదాల వల్లే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వార్డుసభ్యుడు భార్గవి శివకుమార్, భాస్కర్, గీతా కార్మిక సంఘం నాయకుడు వెంకటేష్, నాయకులు రమేష్, శంకరయ్య, లక్ష్మణ్ యాదవ్, సుదర్శన్, నర్సింహ, గణేష్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్దం కుమార్, మాజీ ఎంపీటీసీ సంజయ్‌కుమార్, విజయ్‌కుమార్, బాల్‌రాజ్, అబేదాబేగం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

» బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం, ఏప్రిల్ 21 : ప్రధాని మోదీతోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యమని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల అభ్యర్థిగా బరిలో నిలిచిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మహేశ్వరం ప్రజలు అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ గెలుపు కోసం ఆదివారం మహేశ్వరంలోని శ్రీ శివగంగ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మోదీని మళ్లీ ప్రధాని కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ పోతర్లసుదర్శన్‌యాదవ్, పరమేష్, రాఘవేందర్, చింటు, గణేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నరీతిలో బీజేపీ ప్రచారం

గచ్చిబౌలి, (ఆంధ్రజ్యోతి) : బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ బొటానికల్ గార్డెన్‌లో ఆదివారం వినూతన్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకింగ్ చేస్తూ, చిన్నారులతో కరాటే చేస్తూ, యోగాసనాలు వేస్తూ సరదాగా ముచ్చటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేస్తాం: మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా విజయం సాధిస్తారని చెప్పారు. నేడు (సోమవారం) ఉదయం విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ వేసే కార్యక్రమం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఉంటుందన్నారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపి జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, ఆంనేయులు గౌడ్, రమణారెడ్డి, దేవునిశర్వలింగం, వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుంది

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ : బీజేపీ బలోపేతానికి కృషి చేసే వారిని అదిష్ఠానం గుర్తించి తగిన గుర్తింపు ఇస్తుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. వీరన్నపేట గ్రామానికి చెందిన బట్టు రాజమల్లేష్ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం అవడంతో ఆదివారం అజీజ్‌నగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఆయనను రత్నం పార్టీ నాయకులతో కలిసి అభినందించి సన్మానించారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తప్పక గుర్తింపు లభిస్తుందని చెప్పారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, ఓబీసీ జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు భీమేందర్‌రెడ్డి, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, వివేక్, బొడ్డు రాజుగౌడ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అందెల శ్రీరాములుయాదవ్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది

వికారాబాద్, ఏప్రిల్ 21: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి మూడోసారి రాబోతుందని, ప్రజలంతా బీజేపీ వెంట ఉన్నారని అసెంబ్లీ కన్వీనర్ శ్రీదర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ కాలనీలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీజేపీ కేంద్రంలో 400 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎవరూ తీసుకోని నిర్ణయాలను మోదీ తీసుకుని దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, పోకల సతీష్, బుస్సా శ్రీకాంత్, కేపీ రాజు, శిరీష, మంజుల, సుచరిత పాల్గొన్నారు.

మాదిగలను వంచించిన కాంగ్రెస్‌ను ఓడిస్తాం

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ మాదిగలను వంచించి మోసం చేసిందని కోడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. మండలంలోని చెంగోల్‌లో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాజీ, ప్రవీణ్, జగదీష్, శ్రీనివాస్, రాములు, వెంకటయ్య, నజీర్, ఆనంద్ పాల్గొన్నారు.

దేశం కోసం బీజేపీని గెలిపించండి

యాలాల: దేశం సురక్షంగా ఉండాలంటే బీజేపీకి ఓటువేసి గెలిపించాలని యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. ఆయన శనివారం రాత్రి యాలాల మండల పరిధిలోని రాస్నం, గంగాసాగర్, తంగాయిపల్లి తండాల్లో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా మాట్లాడుతూ.. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. మంచికి మారుపేరుగా నిలిచిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుగౌడ్, నాగయ్య గౌడ్, మంగలి అశోక్, దేవనూర్ మాజీ సర్పంచ్ శివకుమార్ పాల్గొన్నారు.

వడగళ్ల వాన.. తీరని నష్టం



ఇబ్రహీంపూర్‌లో గాలులకు విరిగి పడిన చెట్టు

» పంట పొలాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

» నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్

పరిగి, ఏప్రిల్ 21: ఈదురుగాలులు, వడగళ్ల వానతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పరిగి మండలం ఇబ్రహీంపూర్, మల్కాయపేట్ తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు వరి, జొన్న, మొక్కజొన్న పంటలకు నష్టం జరిగింది. ఈదురు గాలులతో చెట్లు కూడా విరిగిపడ్డాయి. ఇబ్రహీంపూర్, మల్కాయపేట్ గ్రామాల్లో 150 ఎకరాలకుపైగా వరిపంటకు నష్టం వాటిల్లింది. 40ఎకరాల వరకు మొక్కజొన్న, 10 ఎకరాల జొన్న పంటలు దెబ్బతిన్నాయి. డీఏవో ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం పరిగి మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి పంట పొలాలను సందర్శించారు. నష్టం జరిగి వివరాల నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.



పరిగి మండలం ఇబ్రహీంపూర్ పంటపొలాలను పరిశీలిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి

పంట పొలాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఇబ్రహీంపూర్‌లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పొలాలను ఆదివారం పరిగి ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి సందర్శించారు. రెండు గ్రామాలు, తండాల్లో చేతికొచ్చిన పంట వడగళ్లకు నష్టం జరిగిన రైతులతో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. డీఏవో గోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టం జరిగిన వివరాలను ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. ఎకరానికి ప్రభుత్వం రూ.25వేల పరిహారం ఇవ్వాలని మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంటలు పరిశీలించిన వారిలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.భాస్కర్, అశోక్ రెడ్డి, రవి, బాలయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు

» పైపు లీకేజీలతో అస్తవ్యస్తంగా రోడ్లు

» పట్టించుకోని అధికారులు

తాండూరు, ఏప్రిల్ 21: తాండూరు మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, యంత్రాగం నిర్లక్ష్యం వహిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో తరచూ పైపులు లీకేజీ అవుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు కాలనీల్లో సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. కార్యాలయానికి వచ్చి చెప్పినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. లీకేజీలు చేసిన వద్ద గుంతలను పూడ్చకుండా వదిలేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇక్కడి అధికారులు పెడచెవిన పెడుతున్నారు. సాయిపూర్ ప్రాంతంలోని న్యూనలందా హైస్కూల్ వద్ద నెల రోజులవుతున్నా లీకేజీతో నీరు వృథా అవుతోంది. భవానీ నగర్‌లోని దర్గా సమీపంలో నాలుగు రోజుల కింద మరమ్మతులు చేపట్టడానికి తవ్వి అలాగే వదిలేశారు. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆటలాడుకునే చిన్నారులు గుంతలో పడితే ప్రమాదం ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కేవలం ఇవి మచ్చుకు కొన్ని మాత్రమేనని ఇలాంటి గుంతలు, లీకేజిలు పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఉన్నాయి. బల్దియా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు కోరుతున్నారు.



భవానీనగర్‌లో ప్రమాదకరంగా మరమ్మతులకు తవ్విన గుంత



సాయిపూర్‌లో సూపర్ మార్కెట్ వద్ద లీకేజీ

వైభవంగా సేవాలాల్, మరియమ్మ జాతర

» భక్తిశ్రద్ధలతో తండావాసుల పూజలు



కొర్విచెడ్‌లో ఆలయం వద్ద గిరిజనుల మొక్కులు

బషీరాబాద్, ఏప్రిల్ 21 : మండలంలోని కొర్విచెడ్‌ఘని తండాలో సేవాలాల్ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో సేవాలాల్, మరియమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజారులు బజాన్, తుల్జాల ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు తండాలో భజనలతో శోభాయాత్ర నిర్వహించారు. జాతర సందర్భంగా తండాలో ఇంటింటా సందడి నెలకొంది. జాతరకు బషీరాబాద్ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ దంపతులు హాజరై మాజీ సర్పంచ్ సునీతతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో తండాపెద్దలు దేవుజానాయక్, శంకర్, సేవ్యానాయక్, చందర్‌నాయక్, మున్యానాయక్, సూర్యనాయక్, డీలర్ హన్మంతు, మోతీరాం, భీబ్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో ఆలయానికి తరలిన మహిళలు



కొందుర్గు, ఏప్రిల్ 21: మండల కేంద్రంలో ఆదివారం మల్లన్నస్వామి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు మల్లన్న స్వామి దేవాలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మురళీయాదవ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులు కందుకంల రాములుగౌడ్, ఎండీ ఫయిమోద్దీన్, జీబీ కృష్ణ, ప్రేమ్‌కుమార్, డి.శేఖర్, ఎస్.మల్లయ్య, భీమయ్య, వేణుగోపాల్‌గౌడ్, ఎల్లప్ప, నవీన్, వెంకటయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

చేవెళ్ల, ఏప్రిల్ 21 : కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని న్యూజర్నలిస్టు కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, రంగారెడ్డి కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ రాములు, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు సమతరెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

శంకర్‌పల్లి : చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ కోరారు. మండల కేంద్రంతో పాటు చందిప్పలో రంజిత్‌రెడ్డి కుమారుడు ఆర్యరెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగల మాదిరిగా ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాయన్నారు.



వివేకానందనగర్ డివిజన్‌లో ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి


రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : రంజిత్‌రెడ్డి

వివేకానందనగర్ కాలనీ, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని, కేంద్రంలోనూ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే దేశం సంక్షేమం, అభివృద్ధి బాటలో పయనిస్తుందని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో గల ఆంజనేయ స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారం, ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో పాటు కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలతో తెలంగాణలో పేదరిక నిర్మూలనకు బీజం పడిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఎక్కువ మంది గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని, హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి, వివేకానందనగర్ డివిజన్ల మీదుగా చందానగర్ వరకు ర్యాలీ కొనసాగింది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్‌కే సాధ్యం

ఎల్బీనగర్(ఆంధ్రజ్యోతి) : ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని రంజిత్‌రెడ్డి చెప్పారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, రాజీవ్‌గాంధీ చౌరస్తా, టెలిఫోన్‌కాలనీ చౌరస్తాలలో ప్రచారం, కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ హస్తం ప్రజల నేస్తమని, హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : న్యూ జర్నలిస్టు కాలనీలో నాయకుల ప్రచారం

ప్రజా రంజకంగా రేవంత్ పాలన

సరూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజారంజక పాలన కొనసాగుతున్నదని బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని లక్ష్మీనగర్, గ్రీన్‌రిచ్ కాలనీ, బాలాజీకాలనీల్లో రంజిత్ రెడ్డికి మద్ధతుగా ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, తదితరులున్నారు.

రాహుల్ ప్రధాని కావాలని చర్చిలో ప్రార్థనలు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని కోరుతూ ఆదివారం గుర్రంగూడలోని నిట్బూరి ఏసురత్నం చర్చిలో డీసీసీ రంగారెడ్డి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో రంజిత్‌రెడ్డి గెలవాలని, దేశానికి రాహుల్ ప్రధాని కావాలని ఏసును వేడుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు గుర్రం లక్ష్మీనరసమ్మ, చర్చి నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

పరిగి, ఏప్రిల్ 21: పూడూరు మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మేడికొండ మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం మండలం మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు ఎ.జగన్, కె.అశోక్, రామయ్య, శేఖర్, సాయి, అంబదాస్, కె.అంజిలయ్య, శ్రీనివాస్, రవి, శ్రీహరి డీలరు నర్సింహులు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పథకాల అమలు చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయండి

పెద్దేముల్: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పెద్దేముల్ మండలంలో చేపట్టిన పర్యటనను విజయవంతం చేయాలని క్యాంపు కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. పెద్దేముల్ మండలంలో నేడు(సోమవారం) ఉదయం 8గంటలకు బాయిమీదితండా నుండి పర్యటన ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ



మాల్‌లో కవాతు చేస్తున్న పోలీసులు

యాచారం, ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని గున్‌గల్, మాల్, నందివనపర్తి గ్రామాల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో కవాత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, రిగ్గింగ్‌కు యత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఇంటి యజమాని అనుమతి లేకుండా వాల్‌పోస్టర్లు, గోడలపై రాతలు రాయకూడదన్నారు.

సభకు తరలిన కాంగ్రెస్ నేతలు



సభకు వెళుతున్న కాంగ్రెస్ నేతలు

మంచాల, ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డికి మద్దతుగా భువనగిరిలో జరిగిన కాంగ్రెస్ సభకు మండలానికి చెందిన కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. రాష్ట్ర నేతలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జెనిగె వెంకటేష్‌యాదవ్, చీమల జంగయ్యాయాదవ్, కె.శ్రీనివాస్ నాయక్, జంగయ్యగౌడ్, వాజీద్, కిషన్‌నాయక్, మల్లేష్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

షాబాద్, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో భక్త సిరియాల వీధి నాటకాన్ని ఆదివారం కళాకారులు ప్రదర్శించారు. కంప్యూటర్ యుగంలో కూడా గ్రామాల్లో నేటికీ వీధి నాటకాలు ప్రజలను కనువిందు చేస్తున్నాయని పలువురు అన్నారు. ఈ నాటకం చూడటానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు బ్రహ్మ, విష్ణు, శివుడు, పార్వతీదేవి, సరస్వతీ, లక్ష్మీదేవి, శ్రీదండరాజు, సుగుణదేవి, వేశాల్లో నాటకాన్ని ప్రదర్శించారు. నాటకాన్ని నేర్పించిన రాంచంద్రయ్య. చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీ లేదు



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం, ఏప్రిల్ 21 : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని, ఆ పార్టీల నాయకుల అవినీతిని ఎండగట్టాలంటే మచ్చలేని బీజేపీ నేత డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను భువనగిరి ఎంపీగా గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఓటర్లను కోరారు. ఆదివారం రాత్రి ఆయన బీజేపీ నాయకులు మేకల యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బీజేపికి ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలో మైనింగ్ జోన్ ఏర్పాటుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పూనుకుంటున్నారని ఆరోపించారు. మైనింగ్‌జోన్ రద్దు కోసం బీజేపీకి ఓటు వేసి, ఉద్యమానికి ఊతమివ్వాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఓ మాట, అధికారం కోల్పోతే మరోమాట చెప్పి ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించాలన్నారు.

రేపు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌ప్యాలస్‌లో మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రావు, బోడివెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, వీరన్న తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి దౌల్తాబాద్ మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

బొంరాస్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్‌లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట్, దుద్యాల మండల నాయకులు నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖర్, రాజేశేరెడ్డి, రామచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, మెరుగు వెంకటయ్య, నర్సింహులునాయుడు, భీమయ్యగౌడ్ తదితరులు పిలుపునిచ్చారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

షాబాద్, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని చిన్న సోలిపేట్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో హోమాలు, పూర్ణాహుతి, పారాయణాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి బొడ్రాయికి బోనాలు, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ : బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి



ఆమనగల్లు : పూజలు చేస్తున్న అర్చకులు

ప్రారంభమైన ద్వితీయ బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : మండల కేంద్రంలోని శ్రీ విజయ గణపతి, శ్రీ జ్ఞాన సరస్వతి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి, శ్రీ సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ద్వితీయ వార్షికోత్సవాలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయ ధర్మకర్త పోకల బస్వరాజ్ రాజమణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు సుప్రభాత సేవతో స్వామి వార్లకు మేలుకొలుపు పాడారు. దేవతా మూర్తుల విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దిలీప్, వినయ్, సంతోష్, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, విశ్వనాథం, మల్లికార్జున్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసం అవకాశవాద రాజకీయాలు

ఆమనగల్లు , ఏప్రిల్ 21 : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉనికి కోసం చేస్తున్న అవకాశ వాద రాజకీయాలు, కుట్రలను ప్రజలంత తిప్పికొట్టాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ను ఏ శక్తి ఢీకొనలేదని, మరో పదేళ్ల కాంగ్రెస్‌దే అధికారమని చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని లోక్‌సభ ఎన్నికల్లో మరో మారు కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీ కుట్ర రాజకీయాలకు తెరలేపాయన్నారు. ఆమనగల్లు మాజీ ఎంపీటీసీ కాయితి చిన్నారెడ్డిహైమావతి దంపతుల కూతురు శ్రావ్యఅవినాష్ , టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ మేనల్లుడు ప్రవీణ్‌పూజ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి, కాలే మల్లయ్య, మిట్టపల్లి అంజయ్య, దామోదర్‌రెడ్డి, బీక్యనాయక్, బీచ్యనాయక్, చేగూరి వెంకటేశ్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.



వివాహ వేడుకలో ఎమ్మెల్యే కసిరెడ్డి

నామినేషన్‌కు తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ నేడు (సోమవారం) భువనగిరిలో నామినేషన్ వేయబోతున్నారని, ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, నాయకులు నవాజ్, రాజిరెడ్డి తదితరులున్నారు.

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

చౌదరిగూడ/కేశంపేట/షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 21 : మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, చైదరిగూడ మండలాధ్యక్షుడు కురుమయ్య, కేశంపేట మండలాధ్యక్షుడు రొల్ల రఘురాములు గౌడ్ అన్నారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఆదివారం షాబాద్, చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో వారు వేర్వేరుగా జరిగిన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు బీజేపీకి ఓటు వేసేందుకు ఉత్సాహంతో ఉన్నారని, మళ్లీ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి, మచ్చ సుధాకర్ రావు, అనిల్‌కుమార్, రాజు, సురేష్, పద్మ కృష్ణయ్య, తట్టెపల్లి నరసింహ, లంకపోతుల విఠల్‌గౌడ్, దొడల వెంకటేష్, రామకృష్ణ, శివకుమార్, భాను ప్రసాద్, పాల్గొన్నారు.



చౌదరిగూడలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆలయాల నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్వాహకులతో వెంకటేశ్

ఆమనగల్లు, ఏప్రిల్ 21 : ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లిలో శివాలయం, హనుమాన్ ఆలయాల నిర్మాణానికి తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. స్థానికుల కోరిక మేరకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.75 వేలు విరాళం ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆలయన నిర్వాహకులకు చెక్కును అందజేశారు. ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని వెంకటేశ్ సూచించారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాతరాములు, నాయకులు మంచుకొండ విష్ణువర్ధన్, రాములు నాయక్, వెంకట్ రెడ్డి, జగదీశ్వర్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 24న రక్తదాన శిబిరం

చేవెళ్ల, ఏప్రిల్ 21 : ఈనెల 24న మండల కేంద్రంలోని సంత్ నిరంకారి సత్సంగ్ భవనంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించబోతున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం పరమాత్మ ప్రసాదించిన అమూల్యమైన వరమన్నారు. దాతలు రక్తదానం చేసి ప్రాణదాతలు నిలువాలని సూచించారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ప్రజలు తిరస్కరించినా మార్పు లేదు

ఆమనగల్లు, ఏప్రిల్ 21 : ప్రజలు తిరస్కరించినా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌లో మార్పు లేదని, ఆయన రాజకీయ జీవితంలో ఏనాడు వాస్తవాలు మాట్లాడలేదని ఆమనగల్లు ఎంపీపీ అనితవిజయ్, వైస్‌ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లమల్ల జగన్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ నిట్టమంగమ్మ నారాయణ తిరిగి బీఆర్ఎస్ కు వస్తున్నట్లు తనకు ఫోన్ చేస్తున్నారని ఇటీవల ఆమనగల్లులో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో జైపాల్ యాదవ్ మాట్లాడడంపై తీరు వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ కు భవిష్యత్తు లేదని గ్రహించి, అనేక మంది ఆ పార్టీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీజేపీతో చర్చలు ఫలించక బీఆర్ఎస్‌లో ఉండిపోయిన జైపాల్ యాదవ్ తమపై ఆరోపణ చేయడం సరికాదన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్ ఖాద్రీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాలే మల్లయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గండికోట మల్లేశ్, విజయ్‌రాథోడ్, కొండల్, శేఖర్, సాయిలు యాదవ్, రాఘవేందర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ, తదితరులు

కాంగ్రెస్ బీఎల్ఏల ట్రైనర్‌గా గౌరి సతీష్



గౌరి సతీష్

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)లకు శిక్షణ ఇచ్చేందుకు ఆ పార్టీ ట్రైనర్లను నియమించింది. అందులో భాగంగా మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్‌ను సికింద్రాబాద్, మెదక్, నిజామాబాద్, లోక్‌సభ నియోజకవర్గాల బీఎల్ఏల ట్రైనర్‌గా నియమిస్తూ టీపీసీసీ వార్ రూం చైర్మన్ ప్రవీణ్ మల్లాడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గౌరి సతీష్ మాట్లాడుతూ మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తానని చెప్పారు.

వైభవంగా మైసమ్మ తల్లి జాతర

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 21 : మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ఆదివారం మైసమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సంవత్సరం వైభవంగా నిర్వహించే జాతర ఉత్సవాల్లో గౌడవెల్లి గ్రామ ప్రజలే కాకుండా మండలంలోని గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. జాతర ఉత్సవాల్లో పాల్గొనడానికి విచ్చేసే భక్తుల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మైసమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పార్వతీ పరమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బొంరాస్‌పేట్: మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో శ్రీపార్వతీ పరమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున సుప్రభాతం, స్వామివారికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

మేడ్చల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తా



ప్రచారం నిర్వహిస్తున్న సునీత మహేందర్ రెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మేడ్చల్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మేడ్చల్ ప్రాంతం నగరానికి ఆనుకుని ఉన్నప్పటికీ అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడ్చల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మల్కాజ్‌గిరి కాంగ్రెస్‌ను గెలుపిస్తే కనీవిని ఎరుగని తరహాలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను తూచాతప్పకుండా నెరవేరుస్తుందన్నారు. ప్రస్తుతం బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మతత్వ, అవినీతి పార్టీలను తరిమి కొట్టటానికి ప్రజలు సిద్ధంకావలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, స్థానిక నాయకులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర

కీసర, ఏప్రిల్ 21: భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని దళిత సంఘం రాష్ట్ర నాయకుడు రాపోలు రాములు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కీసరలో రాపోలు రాములు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి ప్రజలు చేసిందేమీలేదన్నారు. నల్లధనం వెనక్కి తీసుకొచ్చి, నిరుపేదలకు బ్యాంక్ అకౌంట్‌లో వేస్తానని హామీ ఇచ్చి ఏం చేశారని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ విస్మరించిందన్నారు. దేశంలో దళితులపై దాడులు జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడం పట్ల రాపోలు రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సార్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అబద్దాలను ప్రచారం చేస్తూ మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని మండిపడ్డారు. బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కచ్చితంగా మారుస్తుందని అన్నారు. ఎన్నికల్లో బీజేపీకి దళితులు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కీసరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాములు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 21 : షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశంపేట బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నందిగామ మండల కేంద్రానికి చెందిన మల్లేష్(23) అనే యువకుడు ఆదివారం షాద్‌నగర్‌లో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై వెళుతున్నాడు. కేశంపేట బైపాస్ చౌరస్తా నుంచి నందిగామ వైపు మళ్లుతుండగా జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ గుర్తు తెలియని వాహనం అతని బైక్‌ను ఢీకొంది. బైక్‌పై నుంచి కింద పడగానే ఆ గుర్తుతెలియని వాహనం పైనుంచి వెళ్లడంతో అతని శరీరం నడుము నుంచి కాళ్ల వరకు ఛిద్రమైపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజీల్లో వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 21 : షాద్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధిలోని సోలీపూర్ శివారులో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. ఎర్ర బిడుసు తండాకు చెందిన పాత్లావత్ వాలీ(58) పశువులను మేపుతుండగా ఆదివారం మధ్యాహ్నం సోలీపూర్ బ్రిడ్జి వద్ద రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. స్టేషన్ మాస్టర్ అబిదేశ్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదుపుతప్పి బైక్‌ను ఢీకొన్న కారు



నుజ్జునుజ్జయిన బైక్



చికిత్స పొందుతున్న నూర్

శంషాబాద్, ఏప్రిల్ 21 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఔటర్ రింగురోడ్డు పక్కన గల సర్వీసు రోడ్డులో వెళుతున్న ఓ కారు అదుపు తప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఓ విద్యార్థికి తీవ్రగాయాలు కాగా చికిత్సకోసం అతన్ని ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ మండలం కాచారంలోని వర్ధమాన్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి నూర్‌మహ్మద్ శంషాబాద్ ఔటర్‌రింగురోడ్డు పక్కన ఉండే రాయల్ విల్లాస్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతను కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు అదుపుతప్పి అతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ధ్వంసం కాగా, అతనికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు ప్రారంభించారు.

బ్యూటీ క్లినిక్‌లపై అధికారుల దాడులు

రాయదుర్గం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని దీప్తి పర్మినెంట్ మేకప్ అండ్ కాస్మోటిక్ క్లినిక్, మాదాపూర్‌లోని వీ-స్పార్క్‌వెల్‌నెస్ క్లినిక్‌లపై రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఆదివారం దాడులు నిర్వహించింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేని క్లినిక్‌లపై అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా, అర్హులైన డెర్మటాలజిస్ట్ లేకుండా స్కిన్ ట్రీట్‌మెంట్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డ్రగ్స్ లైసెన్స్ లేకుండా బ్యూటీ ప్రొడక్ట్స్‌ను విక్రయిస్తున్నారని అధికారులు గుర్తించారు. త్వరలో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రభుత్వ లైసెన్సు లేకుండా క్లినిక్‌లలో బ్యూటీ ప్రొడక్ట్స్ విక్రయించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా సరైన డాక్టర్లు లేకుండా ఉండే క్లినిక్‌లను గుర్తించి ప్రజలు వెళ్లకూడదని చెప్పారు.

చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

మేడ్చల్‌టౌన్, ఏప్రిల్ 21 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నూతన్‌కల్ గ్రామ చెరువులో మతి స్థిమితం లేని ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్‌కల్ గ్రామ నివాసి మస్క్యారి నవీన్(31) మృతదేహం ఆదివారం స్థానిక పెద్ద చెరువులో తేలియాడుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. దర్యాప్తు చేయగా మృతుడు కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకుండా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

సీనియర్ సైంటిస్ట్ పేకాట దందా

- పేకాట స్థావరంపై దాడి.. 14 మంది అరెస్ట్



పట్టుబడిన పేకాట రాయుళ్లు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 21 : గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై మేడ్చల్ ఎస్వోటీ, మేడ్చల్ పోలీసులు దాడిచేశారు. పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 53 వేలు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఓ ప్రముఖ సంస్థలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న పెగినేని రాజేష్ అక్రమ సంపాదన కోసం పెద్దఎత్తున గ్యాంబ్లింగ్ స్థావరాలను నిర్వహిస్తున్నాడని గుర్తించారు. ఇతడు తరచూ స్థావరాలు మార్చుతూ పోలీసులకు పట్టుబడకుండా మూడేళ్లుగా పేకాట నిర్వహిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ప్రతీ ఆటకు రూ.1000 కమిషన్ తీసుకొని పేకాడేందుకు గేమింగ్ కాయిన్లు సరఫరా చేస్తున్నాడు. ఆదివారం కండ్లకోయలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఇతడి పేకాట స్థావరంపై దాడిచేసిన పోలీసులు ప్రధాన ఆర్గనైజర్ పెగినేని రాజేష్‌తోపాటు మరో 13మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు.

ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికుడి దాడి

వికారాబాద్, ఏప్రిల్ 21 : బస్సులో ఉన్న డ్రైవర్లపై అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ మహిళా కండక్టర్ సోమవారం వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ సదాశివపేట మార్గంలో నడిచే బస్సులో మధ్యాహ్నం ఇద్దరు డ్రైవర్లు రాములు, కృష్ణ, కండక్టర్ స్వాతి భోజనం చేస్తున్నారు. అదే సమయంలో ఓ వ్యక్తి తన భార్యతో కలిసి బస్సు ఎక్కాడు. దీంతో మరికొంత మంది బస్సు ఎక్కే ప్రయత్నం చేశారు. భోజనం చేస్తున్నామని, బస్సు వెళ్లేందుకు కొంత సమయం పడుతుందని డ్రైవర్లు, కండక్టర్ చెప్పారు. దీంతో సదరు ప్రయాణికుడు డ్రైవర్లపై దాడిచేసి బస్సు నుంచి కిందకు దించి మరీ చితకబాదాడు. ఈ క్రమంలో డ్రైవర్లతో పాటు కండక్టర్ స్వాతికి గాయాలయ్యాయి. కండక్టర్ స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

వికారాబాద్, ఏప్రిల్ 21 : రైలులో సెల్‌ఫోన్ మరిచిపోయిన బాధితుడికి వెతికి అప్పగించినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బెంగళూరు నుంచి తాండూరు వస్తున్న ఎండీ గఫార్ అనేవ్యక్తి తన యాపిల్ ఫోన్ (రూ.30వేలు)ను పోగొట్టుకున్నాడు. ఈ విషయం రైల్వే పోలీసులకు సమాచారం అందించగా ఆపరేషన్ అమానత్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు దాన్ని గుర్తించి బాధితుడికి అప్పగించారు. ఇప్పటి వరకు 22 సంఘటనలో మొత్తం 4.65 లక్షల విలువైన వస్తువులను గుర్తించి ప్రయాణికులకు తిరిగి అప్పగించినట్లు తెలిపారు. వీటిలో ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్లు, డబ్బులు, బంగారం ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. రైలులో ఏ వస్తువులైనా పడిపోతే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.